క్లుప్తంగా

డయల్ యువర్ డీఎంకు నాలుగు వినతులు

రాయదుర్గంటౌన్: రాయదుర్గం ఏపీఎస్ ఆర్టీసీ డిపోలో శుక్రవారం సాయంత్రం 4 గంటల నుంచి 5 వరకు డీఎం సురేష్ ఆధ్వర్యంలో డయల్ యువర్ డీఎం కార్యక్రమం జరిగింది. ప్రయాణికుల నుంచి నాలుగు సమస్యలు స్వీకరించినట్లు చెప్పారు. కేపీకుంట గ్రామం నుంచి చెళ్లికెర, రాయదుర్గానికి బస్సు సౌకర్యం కల్పించాలని హరికృష్ణ, రాయదుర్గం నుంచి బెంగళూరుకు సూపర్ లగ్జరీ, సెమిలగ్జరీ బస్సులు ఏర్పాటు చేయాలని, అలాగే రాత్రి 8 - 9 గంటలకు రాయదుర్గం నుంచి బళ్లారికి బస్సు సర్వీసు ఏర్పాటు చేయాలని ప్రహ్లాద, రాయదుర్గం నుంచి సాయంత్రం 6 గంటల తరువాత చైన్నై బస్సు తరువాత రెండు గంటల పాటు ఒక్కబస్సు కూడా లేదని, ఈ మధ్యన ఒక బస్సు ఏర్పాటు చేయాలని ఎంఎం బాబు, రాయదుర్గం నుంచి మొలకాల్మూరు, మంత్రాలయంకు బస్సు నడపాలని సంతోష్ కోరినట్లు చెప్పారు.

హోరాహోరీగా స్కూల్ గేమ్స్



క్రీడాకారులకు మెడల్స్ అందజేసి అభినందిస్తున్న ఉపాధ్యాయులు

విడపనకల్లు: మండలంలోని గడేకల్లు జెడ్పీ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి స్కూల్ గేమ్స్ శుక్రవారం నిర్వహించారు. పోటీలో అండర్ 14,17 విభాగానికి చెందిన బాల బాలికలు కబడ్డీ, లాంగ్ జంప్, హైజంప్, చెస్, రన్నింగ్, వాలీబాల్, బాడ్మింటన్, ఖోఖో అథ్లెటిక్ పోటీలు నిర్వహించారు. హావళిగి, కరకముక్కల, పాల్తూరు, పెద్ద కొట్టాలపల్లి, విడపనకల్లు, చీకలగురికి, జెడ్పీ ఉన్నత పాఠశాలలకు చెందిన క్రీడాకారులతో పాటు, మోడల్ స్కూలు, కస్తూరిబా పాఠశాలకు చెందిన క్రీడాకారులు కూడా పాల్గొన్నారు. మండల స్థాయిలో గెలుపొందిన క్రీడాకారులు జిల్లా స్థాయి క్రీడల్లో పాల్గొంటారు.

గ్రామ సచివాలయం తనిఖీ

బొమ్మనహాళ్: మండలంలోని ఎర్రగుడి గ్రామ సచివాలయాన్ని ఎంపీడీఓ రామచంద్ర శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటిస్తున్నారా? లేదా, ప్రజలకు సకాలంలో సేవలందిస్తున్నారా లేదా అని ఆరా తీశారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ఈనెల 17 నుంచి ప్రారంభం అయ్యే స్వచ్ఛతహిసేవ కార్యక్రమాన్ని షెడ్యూల్ ప్రకారం ఏరోజు కారోజు అన్ని కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శంకర్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

కళ్యాణదుర్గం రూరల్: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని సీడీపీఓ లక్ష్మీప్రసన్న తెలిపారు. శుక్రవారం మండలంలోని మల్లిపల్లి అంగన్‌వాడీ సెంటర్‌లో పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ప్రదమ్ కోఆర్డినేటర్ రామ్‌మోహన్, సూపర్‌వైజర్లు, అరుణ, జ్ఞానేశ్వరి, అంగన్‌వాడీ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

ఎంఈఓ-2 వద్దని ఉపాధ్యాయుల నిరసన



తహసీల్దార్ షర్మిలకు వినతిపత్రం అందిస్తున్న ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు

బొమ్మనహాళ్: మండలంలో ఎంఈఓ-2 హరికృష్ణ తమకు వద్దంటూ పలు ఉపాధ్యాయ సంఘాల ఉపాధ్యాయులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు.అనంతరం తహసీల్దార్ షర్మిలకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో యూటీఎఫ్, ఏపీటీఎఫ్, ఏపీటీఎఫ్-1938 మండల జిల్లా కౌన్సిల్ ప్రతినిధులు శ్రీనివాసులు, తిప్పేస్వామి, రామస్వామి, నాగరాజు, అర్జున్, హనుమంతునాయక్, మహిళా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవంగా గణేష్ నిమజ్జనం



ఉరవకొండలో నిమజ్జనానికి తరలివెళ్తున్న గణనాథుడు

ఉరవకొండ: పట్టణంలో పలు కూడళ్లలో కొలువుదీరిన వినాయక విగ్రహాలను భారీ ఊరేగింపు నడుమ శుక్రవారం నిమజ్జనానికి తరలించారు. స్థానిక ఆంజనేస్వామి ఆలయం, సీఎస్ఐ చర్చి, రంగావీధి, ఇంద్రానగర్ తదితర ప్రాంతాల్లో కొలువుదీరిన వినాయక విగ్రహాలను ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెన్నహోబిళం వద్ద పెన్నా నదిలో విగ్రహాలను నిమజ్జనం చేశారు.

ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం

గుమ్మఘట్ట: మండలంలోని భూపసముద్రం గ్రామ సమీపంలోని వేదావతి నది నుంచి ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు రూరల్ సీఐ వెంకటరమణ శుక్రవారం తెలిపారు. ట్రాక్టర్లను తహసీల్దార్‌కు అప్పగించినట్లు తెలిపారు.

వైద్యవిద్య మరింత భారమవుతుంది



నీట్ రాసి వైద్య విద్య చదవాలని అందరికీ కల ఉంటుంది. ప్రభుత్వ వైద్య కళాశాలల్లో సీటు సాధించాలనే తపనతో నీట్ పరీక్ష రాశా. ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే మెరిట్ విద్యార్థులకు వైద్య విద్య మరింత భారం కావడం ఖాయం. ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ప్రైవేట్ పరమైతే రూ.కోట్లు ఖర్చు పెట్టి ఎంబీబీఎస్ చదివే స్థోమత నాకు లేదు. ప్రైవేట్ పరం చేయకుండా ప్రభుత్వమే నిర్వహిస్తే బాగుంటుంది.

– పి.నాగశంకర్, నీట్ విద్యార్థి, ఉరవకొండ



ప్రైవేటీకరణపై మొగ్గుచూపడం దారుణం



నాకుమార్తె నందిని నీట్ రాసింది. కౌన్సెలింగ్‌లో ఒక్క మార్కు తేడాతో సీటు కోల్పోవాల్సి వచ్చింది. రాష్ట్రంలో ఉండే అన్ని వైద్య కళాశాలలకు అనుమతి ఉంటే వైద్య విద్య సీటు సులభంగా దక్కేది. దీనికి విరుద్ధంగా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోంది. మెడికల్ కళాశాలలకు అనుమతి నిరాకరిస్తూ, ప్రైవేటీకరణపై మొగ్గు చూపడం దారుణం. మెడిసిన్ సీట్లపై పేద కుటుంబాల్లో ఆందోళన మొదలైంది. చంద్రబాబు తీరుపై వైద్య విద్యార్థులంతా కసితో రగిలిపోతున్నారు.

– వన్నూరుస్వామి, డీహీరేహాళ్

నులిమేద్దాం

- నులి పురుగులతో పిల్లల్లో శరీరక, మానసిక ఎదుగుదలపై ప్రభావం
- 17న జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవంలో భాగంగా ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

ఉరవకొండ, కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాల్లో 19 ఏళ్లలోపు పిల్లల వివరాలు:

నియోజక వర్గం పేరు	19 ఏళ్లలోపు పిల్లల సంఖ్య
ఉరవకొండ	36,500
కళ్యాణదుర్గం	39,459
రాయదుర్గం	41,523

కూడేరు: నులిపురుగులు పిల్లల్లో వచ్చే అనేక అనారోగ్య సమస్యలకు ప్రధాన కారణమవుతాయి. ఇవి పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలపై ప్రభావం చూపుతాయి. పిల్లల కడుపులో ఉండే నులి పురుగులను తేలికగా తీసుకుంటే వారి ప్రాణానికే ప్రమాదమే. నులి పురుగులు 1-19 ఏళ్ల వయసు పిల్లల్లో ఎక్కువగా చేరి ప్రభావం చూపుతాయి. నులి పురుగులతో కలిగే ఆరోగ్య ఇబ్బందులను చిన్న పిల్లలు బయటకు వ్యక్తం చేయలేని పరిస్థితి ఉంటుంది. పెద్దలు తొందరగా గుర్తించి నివారణ చర్యలు చేపడితే బాగుంటుంది. లేదంటే రక్త హీనత ఏర్పడి ఆరోగ్య సమస్యలు తలెత్తి ఎదుగుదల లేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది.

నులి పురుగులు ఇలా చేరతాయి..

నులి పురుగులు హెల్‌మెంత్ అనే పరాన్న జీవి జాతికి చెందినది. ఇవి మూడు రకాలు. 1.రౌండ్ వారమ్స్, 2.పిన్ వారమ్స్, 3.ఫ్లూక్స్. పిల్ల పేగుల్లో ఎక్కువగా పిన్ వారమ్స్, ఫ్లూక్స్ జాతి పురుగులు జీవిస్తాయి. రౌండ్ వారమ్స్ జాతి పురుగులు పెంపుడు జంతువులైన పిల్లి, కుక్కల్లోనే కాకుండా మట్టిలో కూడా నివసిస్తాయి. పిల్లలు పెంపుడు జంతువులతో సన్నిహితంగా ఉన్నా లేదా కలుషిత ఆహారం, నీరు తీసుకున్నా నులిపురుగులు చేరుతాయి. పిన్ వారమ్స్‌ఫ్లూక్స్ వారమ్స్ అనే జీవులు లార్వా రూపంలో మట్టిలో ఉంటాయి. పిల్లలు చెప్పులు లేకుండా మట్టిలో తిరిగినపుడు కాళ్ల చర్మం ద్వారా రక్తంలోకి చేరుతాయి.

లక్షణాలు ఇవీ..

పిల్లల కడుపులోకి నులి పురుగులు చేరితే కడుపునొప్పి, రక్తహీనత, వాంతులు, విరేచనాలు, అలసట, వికారం, బద్ధకం, నిరంతరం దగ్గు, దురద, నొప్పితో కూడిన మూత్ర విసర్జన, బరువు తగ్గిపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి.



కూడేరు: ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

ఈ విధంగా అరికట్టొచ్చు..

కొన్ని జాగ్రతలు పాటించడం ద్వారా నులి పురుగుల వ్యాప్తిని అరికట్టొచ్చు. బహిరంగ ప్రదేశాల్లో మలవిసర్జన చేయకుండా వ్యక్తిగత మరుగుదొడ్డిని వాడాలి. మల విసర్జన తర్వాత, భోజనానికి ముందు చేతులను సబ్బుతో బాగా శుభ్రం చేసుకోవాలి. చేతి వేళ్ల గోర్లు పెరగకుండా ఎప్పటికప్పుడు కత్తిరించుకోవాలి. చెప్పులు ధరించాలి. పరిశుభ్రమైన ఆహారాన్ని, నీటిని తీసుకోవాలి.

ఆల్బెండజోల్‌తో నివారణ..

నులి పురుగుల నివారణరణకు ఆల్బెండజోల్ దివ్య ఔషధం. రెండేళ్ల వయసులోపు పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలను 200ఎంజీ వేసుకోవాలి. అలాగే మిగిలిన వయసు పిల్లలకు 400 ఎంజీ ఇవ్వొచ్చు.

ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలి



ఈ నెల 17న జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం కార్యక్రమంలో భాగంగా అన్ని గ్రామాల్లో వైద్య సిబ్బంది పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు ఇస్తారు. పిల్లల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పిల్లలు తప్పకుండా ఆల్బెండజోల్ మాత్రలు వేసుకునేలా చూడాలి. లేదంటే ఆరోగ్య సమస్యలు తలెత్తి పిల్లలు ఇబ్బంది పడాల్సి వస్తుంది.

– లక్ష్మీనారాయణ, కూడేరు మండల వైద్యాధికారి

చంద్రబాబుది మాట తప్పే నైజం

కళ్యాణదుర్గం రూరల్: కూటమి నాయకులు ఎన్నికల సమయంలో ఎస్సీల కోసం అలవిగాని హామీలను ఇచ్చారని, గెలిచిన తర్వాత హామీల అమలుపై పట్టించుకోలేదని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు ఆర్జే ప్రకాష్ మాదిగ అన్నారు. ఇచ్చిన మాట తప్పడం కేవలం చంద్రబాబుకే దక్కుతుందన్నారు. శుక్రవారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం తీర్పును గౌరవిస్తూ ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలన్నారు.

కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉరవకొండ రాజు మాదిగ, రాయలసీమ జిల్లాల అధికార ప్రతినిధి హెచ్ అక్కులప్ప మాదిగ, అనంతపురం, సత్యసాయి ఉమ్మడి జిల్లాల ఉపాధ్యక్షులు వన్నూరుస్వామి, నియోజవర్గం అధ్యక్షులు లక్ష్మణమూర్తి మాదిగ, కళ్యాణదుర్గం మండల అధ్యక్షులు జెన్ని సురేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షులు ఆర్జే ప్రకాష్ మాదిగ

సీతారాం ఏచూరి మృతి తీరని లోటు

కూడేరు: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి పార్టీకి తీరని లోటు అని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు కృష్ణమూర్తి అన్నారు. శుక్రవారం కూడేరులోని సీపీఎం కార్యాలయంలో సీతా రాం ఏచూరి చిత్రపటానికి పార్టీ నేతలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు కృష్ణమూర్తి, మండల నాయకులు పాల్గొన్నారు.

వజ్రకరూరు: సీతారాం ఏచూరి మృతి తీరనిలోటు అని సీపీఎం నియోజకవర్గ నాయకులు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సంతాప సభలో సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటం ఏర్పాటు చేసి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు రంగారెడ్డి, మండల కార్యదర్శి విరుపాక్షి, ఎంపీహెచ్ఈఓ గురుప్రసాద్, సీఐటీయూ నాయకులు షెక్షావలి, చిన్నఆంజనేయులు, నరసింహులు, రాకెట్లనాగన్న, జేవీవీ జిల్లాకార్యదర్శి మల్లికార్జున పాల్గొన్నారు.

స్వచ్ఛతహి సేవా పోస్టర్ల విడుదల

రాయదుర్గంటౌన్: పట్టణంలో ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు జరిగే స్వచ్ఛతహి సేవా కార్యక్రమం ఉంటుందని మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప తెలిపారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో స్వచ్ఛత హి సేవా పోస్టర్ విడుదల చేశారు. కౌన్సిలర్లు శారదదేవి, గౌని లా వణ్య, వార్డు ఇన్‌చార్జ్ పొరాళ్ల శివకుమార్ పాల్గొన్నా రు.

శెట్టూరు: స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాన్ని పక్కాగా అమలు చేద్దామని తహసీల్దార్ ఈశ్వరయ్య శెట్టి అన్నారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాయలంలో ఎంపీడీఓ రఘురాంరావు, డాక్టర్ తరుణసాయితో కలిసి స్వచ్ఛత హీ సేవ కార్యక్రమం మార్గదర్శకాలు విడుదల చేశారు. ఎంఈఓ శ్రీధర్, వైద్య, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

దాణా కోసం దరఖాస్తు చేసుకోండి

కూడేరు: ప్రభుత్వం 75 శాతం సబ్సిడీతో అందించే సంపూర్ణ మిశ్రమ దాణా (టీఎంఆర్) కావాల్సిన రైతులు, పాడి పెంపకందారులు రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని మండల పశు వైద్యాధికారి శ్రీనివాసులు శుక్రవా రం తెలిపారు. ఒక కేజీ సంపూర్ణ మిశ్రమ దానా కోసం రూ.6.50 చెల్లించాల్సి ఉంటుందన్నారు. గరిష్ఠంగా 1,800 కేజీలు వరకు ఇస్తామన్నారు.

వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ఉద్యమిస్తాం



వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లుకు వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్న ముస్లిం మత పెద్దలు

ఉరవకొండ: దేశంలో ఉన్న ముస్లింలను వేధించడానికి మత స్వేచ్ఛను హరించడానికి మోదీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, ఇందులో భాగంగానే వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లును తీసుకొచ్చిందని ఉరవకొండకు చెందిన ముస్లిం మత పెద్దలు ధ్వజమెత్తారు. శుక్రవారం స్థానిక అరబిక్ హైస్కూల్ వద్ద బిలాల్ మసీదు ఆవరణలో వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. హాజీ ఖలీఫ్‌సాబ్, హాజీ ముతవలి హబీబ్, హజరత్ ముస్తాఫా, ఖలీల్, జిలాన్, షఫీ, షమ్ము, రాయలసీమ ముస్లిం మైనార్టీ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు అన్సర్ రహంతుల్లా, ఇండియన్ ముస్లిం మైనార్టీ ఆర్గనైజేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లాలు మాట్లాడారు.

కేజ్రీవాల్‌కు బెయిల్ మంజూరుపై హర్షం

రాయదుర్గం: ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు సుప్రీంకోర్టు శుక్రవారం బెయిల్ మంజూరు చేయడంపై ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు వెంకటరమణ బాబు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ న్యాయం గెలిచిందన్నారు. రాజకీయ దురుద్దేశంతో తప్పుడు కేసులు ఎన్నిపెట్టినా న్యాయస్థానం ముందు రుజువు చేయలేక పోయారన్నారు. పార్టీ పట్టణ కన్వీనర్ అబ్దుల్, నాయకులు పాల్గొన్నారు.

115 జీవోను వెంటనే రద్దు చేయాలి

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో స్టాఫ్ నర్సులు శుక్రవారం నిరసన తెలియజేశారు. నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన ర్యాలీ చేశారు. స్టాఫ్ నర్సులు మాట్లాడుతూ ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన జీవోతో కేవలం ఇన్‌సర్వీస్ స్టాఫ్‌నర్సులకు మాత్రమే లబ్ధి చేకూరుతుందన్నారు. డిమాండ్లు పరిష్కరించకపోతే ఈనెల 18న రాష్ట్ర వ్యాప్తంగా సాధారణ విధులతో పాటు అత్యవసర విధులు సైతం బహిష్కరించనున్నట్లు తెలిపారు.

కళ్యాణదుర్గం రూరల్: జీవో నంబర్ 115ను వెంటనే రద్దు చేయాలని కాంట్రాక్ట్ నర్సులు, పారా మెడికల్ సిబ్బంది ప్రభుత్వాస్పత్రి ఎదుట శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కాంట్రాక్ట్ సిబ్బంది మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచే స్తున్న సిబ్బందిని పర్మినెంట్ చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఆస్పత్రి కాంట్రాక్ట్ నర్సులు స్వప్న, శ్యామల, మునిరత్నమ్మ, అంజికా, జ్యోతి, సువర్ణ, పారామెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.



ఆస్పత్రి వద్ద నిరసన తెలుపుతున్న స్టాఫ్ నర్సులు

కార్యకర్తలకు అండగా నిలుద్దాం



జిల్లా అధ్యక్షుడిని కలిసిన పార్టీ నాయకులు



శుభాకాంక్షలు చెబుతున్న మండల నాయకులు

రాయదుర్గం: వైఎస్సార్‌సీపీకి కార్యకర్తలే మూల స్తంభాలని, వారిని కాపాడుకునే బాధ్యత అందరిపైనా ఉందని జిల్లా పార్టీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి తెలిపారు. శుక్రవారం వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రారెడ్డి, జెడ్పీటీసీ హొన్నే మల్లికార్జున, జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, మాజీ ఎంపీపీ గరుడచేడు రాజగోపాల్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ నాగిరెడ్డి, లక్ష్మిరెడ్డి, శివారెడ్డి, ఆనందరెడ్డి, వెంకటరెడ్డితో పాటు నియోజకవర్గంలోని ఆయా మండలాల పార్టీ నాయకులు అనంతపురం వెళ్లి అనంతకు శుభాకాంక్షలు తెలియజేశారు. రాయదుర్గంలో పార్టీ కార్యకలాపాలపై చర్చించినట్లు గౌని ఉపేంద్రారెడ్డి తెలిపారు. డి హీరేహాళ్ మండల కన్వీనర్ ఎం వన్నూర్‌స్వామి ఆధ్వర్యంలో చాలా మంది నాయకులు వెళ్లి జిల్లా అధ్యక్షుడిని కలిసి వచ్చారు.

'అనంత'ను కలిసిన వైఎస్సార్‌సీపీ నేతలు

కణేకల్లు: వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డిని కణేకల్లు మాజీ ఎంపీపీ ఆలేరి రాజగోపాల్‌రెడ్డి, జెడ్పీ మాజీ సభ్యులు పాటిల్ నాగిరెడ్డి, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు పైనేటి తిమ్మప్పచౌదరి తదితరులు శుక్రవారం కలిశారు. జిల్లా కేంద్రంలోని అనంత ఇంటికెళ్లి ఆయన్ను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. కణేకల్లు పట్టణ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ టీ.కేశవరెడ్డి, పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు మారెంపల్లి మారెన్న, ఎంపీటీసీ వన్నూరుషా, నాయకులు ఆలేరి లక్ష్మీకాంతరెడ్డి, హళ్లినాగరాజు, గోవర్దన్‌రెడ్డి, కేసేపల్లి హనుమంతరావు, టైగర్ బాషా, లోకేష్, సలీమ్, నాయకులు జిల్లా అధ్యక్షులను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

సంక్షిప్త సమాచారం

కుష్టు రోగుల కాలనీలో వైద్య శిబిరం

కూడేరు: మండలంలోని కుష్టు రోగుల కాలనీలో శుక్రవారం వైద్యాధికారులు అంగవైకల్య నివారణ వైద్య పునరావాస శిబిరాన్ని ఏర్పాటు చేశారు. డీపీఎంఓ తిప్పేస్వామి కుష్టు రోగుల కాళ్లు చేత వేళ్లకు పుండ్లు కాకుండా తీసుకోవాల్సిన జాగ్రతలపై వివరించారు. అనంతరం ఉచితంగా మందులు, బ్యాండేజ్, కాటన్, పూత మందులు అందించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రవీంద్ర , ఎంఎల్‌హెచ్‌పీ చంద్రకళ, ఏఎన్ఎం భాను, హెల్త్ అసిస్టెంట్ శివప్రసాద్, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

హెచ్ఐవీపై అవగాహన


కూడేరు: మండలంలోని అరవకూరులో చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీం ఆధ్వర్యంలో హెచ్ఐవీపై శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. లింక్ వర్కర్ రాజేశ్వరి హెచ్ఐవీ ఏవిధంగా వ్యాప్తి చెందుతుంతో వివరించారు.

కుందుర్పి: ఎయిడ్స్ వ్యాధి ప్రమాదకరమని, ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని వైద్యాధికారిణి అనూష తెలిపారు. శుక్రవారం మండలంలోని వడ్డేపాళ్యం గ్రామంలో వైద్యసిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు.

గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపర్చండి

కుందుర్పి: గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపర్చాలని ఎంపీడీఓ లక్ష్మీనరసింహ, ఏఓ శంకర్ అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో స్వచ్ఛ తా హి సేవా కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో పారిశుధ్యం మెరుగునకు చేపట్టాల్సిన చర్యలపై సిబ్బంది, సర్పంచులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీటీ తిప్పేస్వామి, ఎంపీపీ కమలమ్మ, జెడ్పీటీసీ రాదాస్వామి, వైద్యాధికారిణి అనూషా, ఆరోగ్య వైద్య సిబ్బంది, సర్పంచులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి



మృతి చెందిన ఆంజనేయులు (ఫైల్)


బొమ్మనహాళ్: మండల పరిధిలోని జీడిపల్లి గ్రామ వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు గాలి ఆంజినేయులు (65) గుండెపోటుతో శుక్రవారం ఆకస్మికంగా మృతి చెందాడు. మాజీ ఎంపీ, కళ్యాణదుర్గం నియోజకవర్గ సమన్వయకర్త తలారి రంగయ్య, ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి జీడిపల్లికి వెళ్లి ఆంజనేయులు మృతదేహం నివాళులర్పించారు.

పరిసరాల శుభ్రత పాటించాలి

బొమ్మనహాళ్: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల శుభ్రతను పాటించి వ్యాధులకు దూరంగా ఉండాలని పీహెచ్‌సీ వైద్యాధికారులు శ్రీలక్ష్మీ, మల్లీశ్వరి సూచించారు. శుక్రవారం మండలంలోని ఉద్దేహాళ్ గ్రామంలో డెంగీ, మలేరియా, సీజనల్ వాధులపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ నాగమణి, ఆరోగ్య కార్యకర్తలు గోవర్ధన, జైనాబీ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

బ్రహ్మసముద్రం : పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం అని మండల వైద్యాధికారి రాజేష్‌కుమార్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో ఫ్రైడే డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. వారు గ్రామంలోని కొత్తిండ్లు కాలనీ, గురుకుల పాఠశాల, తదితర ప్రాంతాల్లో డ్రైనేజీలను పరిశీలించారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

కణేకల్లు: మండలంలోని పెనకలపాడు జెడ్పీహైస్కూల్ ఉపాధ్యాయులు, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు వైఎస్ వేణుగోపాల్ (మ్యాథ్స్) చంద్రమునయ్య (ఫిజిక్స్)లను గ్రామస్తులు సన్మానించారు. శుక్రవారం స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన సన్మానసభలో గ్రామస్తులు అవార్డు గ్రహీతలను సన్మానించారు. కార్యక్రమంలో హెచ్ఎం వేణుగోపాల్, వైఎస్సార్‌సీపీ నాయకులు పూజారి రామాంజనేయులు, సుంకన్న, స్కూల్ కమిటీ చైర్మన్, సభ్యులు పాల్గొన్నారు.

వరద బాధితులకు విద్యార్థినుల చేయూత

రాయదుర్గంటౌన్: విజయవాడ వరద బాధితులకు పట్టణంలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాల విద్యార్థులు చేయూతనందించారు. విద్యార్థినులు సేకరించిన క్వింటాళ్ల బియ్యం, 8 ప్యాకెట్ల దుస్తులను హెచ్ఎం జయప్రద సమక్షంలో వరద బాధితుల సహాయర్థం ఏఐఎస్ఎఫ్, సీపీఐ, ఏఐవైఎఫ్ జిల్లా కమిటీ నాయకులకు శుక్రవారం అందించారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుళ్లాయస్వామి తదితరులు పాల్గొన్నారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

రాయదుర్గంటౌన్: రాజీమార్గంలో కేసుల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షికదారులు సద్వినియోగం చేసుకోవాలని న్యాయ సేవా అధికార సంస్థ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి ఎం.రమ్య తెలిపారు. ఈనెల 14న ఉదయం 10.30 గంటలకు కోర్టులో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జడ్జి తెలిపారు.

కర్ణాటక మద్యం పట్టివేత

గుమ్మఘట్ట: మండలంలోని రంగసముద్రంలో మద్యం విక్రేత మల్లేష్‌ను పట్టుకొని, అతని నుంచి 80 కర్ణాటక మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు స్టేషన్ హౌస్ ఆఫీసర్ రఘు శుక్రవారం తెలిపారు.

జీతాల కోసం అదనపు కార్మికుల ఎదురుచూపు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని కాలువల్లో పూడిక తీత పనులకు ప్రత్యేకంగా తీసుకున్న 20 మంది అదనపు కార్మికులు జీతాలు కోసం ఎదురుచూస్తున్నారు. రోజు వారి కూలి ప్రకారం రెండు నెలల కాలపరిమితికి తీసుకుని పారిశుధ్యం పనులు చేయిస్తున్నారు. జూలై 22వ తేదీ నుంచి ఈ కార్మికులతోనే పట్టణంలో పారిశుధ్యం పనులు చేయిస్తుండగా , రెండు నెలలుగా జీతాలు అందలేదు. ఈ విషయమై మున్సిపల్ ఇన్‌చార్జ్ ఏఈ నరేంద్రను అడగ్గా, అదనపు కార్మికుల జీతాలను కాంట్రాక్టర్ చెల్లించాల్సి ఉంటుందని, ఈ విషయమై కాంట్రాక్టర్‌కు తెలియజేస్తామన్నారు.

కార్మికులకు విశ్రాంత ఉద్యోగుల మద్దతు

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట శ్రీరామరెడ్డి, సత్యసాయి నీటి సరఫరా కార్మికుల 9వ రోజు సమ్మెకు విశ్రాంత ఉద్యోగులు శుక్రవారం మద్దతు తెలిపారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగులు, సత్యసాయి, శ్రీరామిరెడ్డి నీటి సరఫరా కార్మికుల పాల్గొన్నారు.

పశుసంవర్ధకశాఖ డీడీకి సన్మానం

ఉరవకొండ: ఉరవకొండ పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న డాక్టర్ కాంతమ్మ ఇటీవల డిప్యూటీ డైరెక్టర్‌గా పదోన్నతి పొంది, పెనుకొండకు బదిలీ అయ్యారు. శుక్రవారం పదోన్నతి పొందిన డాక్టర్ కాంతమ్మను ఉరవకొండ పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ జి.వెంకటేష్‌తో పాటు పశువైద్యాధికారులు సన్మానించారు. ఉరవకొండ పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో కొత్తగా ఏడీలుగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ పెద్దన్న, డాక్టర్ ఉమామహేశ్వరిని సన్మానించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారులు డాక్టర్ నరేష్, డాక్టర్ శ్రీవిద్యలు పాల్గొన్నారు.

టమాట పంట పశువుల పాలు



బొచ్చుపల్లి వద్ద టమాట పంటను పశువులకు వదిలిన రైతు మహేష్

కుందుర్పి: టమాట బహిరంగ మార్కెట్లలో కిలో రూ.5లు పలుకుతుండడంతో రైతులు చేసేదిలేక టమాట పంటను పశువులు, మేకలు, గొర్రెలకు వదిలేస్తున్నారు. కళ్యాణదుర్గం నియోజకవర్గ వ్యాప్తంగా 8 వేల ఎకరాల్లో టమాట పంట సాగు చేశారు. కాగా ఇటీవల మార్కెట్లలో టమాట ధర అనూహ్యంగా కిలో రూ.5కు పడిపోయింది. రవాణా ఖర్చులకు కూడా రావడంలేదు. దీంతో పంటను పశువులు మేకలు, గొర్రెలకు వదిలేస్తున్నారు. కెంచంపల్లికి చెందిన రైతు రామాంజనేయులు రెండెకరాల్లో రూ.1.20 లక్షలు ఖర్చు చేసి టమాట పంట సాగు చేయగా, కనీసం కూలీల ఖర్చులు సైతం రాలేదని, పంట వదిలేసినట్లు తెలిపాడు. గత జూన్ మాసంలో కిలో రూ.30 ఉన్న టమాట ప్రస్తుతం రూ.5కు పడిపోయింది.